సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 23 । జూలై । 2024



కొత్త బంగారు లోకం

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం కొత్తగా ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. - 8లో



ఫిర్యాదులపై స్పందించాలి

బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ పోలీసు అధికారులను ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

వాతావరణం


జిల్లాలో సోమవారం 24.2 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

గళమెత్తాలి.. దశ మార్చాలి

- ఎమ్మెల్యేలకు జిల్లా ప్రజల డిమాండ్
- రాజోలి రిజర్వాయర్‌తో కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ
- స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్
- 'గండికోట' అభివృద్ధితో పర్యాటకం పరుగులే
- ప్రోత్సహిస్తే తలమానికంగా నిలవనున్న కొప్పర్తి పారిశ్రామికవాడ







సాక్షి ప్రతినిధి, కడప : తెలుగు దేశం ప్రభుత్వానికి జిల్లాపై వివక్ష ఉంది. గత చరిత్ర అందుకు అద్దం పడుతోంది. హామీలు ఇవ్వడం మినహా ఆచరణలో చిత్తశుద్ధి చూపిన పాపాన పోలేదు. ఈసారైన ఇచ్చిన హామీలు అమలు చేస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు స్థానాల్లో ఆశీర్వదించారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా జిల్లాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్యేలుగా తమ ముద్ర జిల్లాపై చూపెట్టాలి. అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసుకొని ప్రభుత్వ పెద్దల మెప్పుతో ప్రగతి సాధించాలి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎమ్మెల్యేలు ప్రజాభీష్టంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. మరి జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యేలు గళమెత్తుతారా.. లేదా వేచి చూడాల్సి ఉంది.

రాజోలి బాధ్యత తీసుకుంటారా!

కేసీ కెనాల్ పరిధిలో జిల్లాలో 95వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. గతంలో రెండు పంటలకు పుష్కలంగా నీరు లభించేది. ప్రస్తుతం ఒక్క పంటకు చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం దుర్లభంగా మారింది. ఆయకట్టు స్థిరీకరణకు రాజోలి రిజర్వాయర్ నిర్మాణమే శరణ్యం. ఇది జగమెరిగిన సత్యం. 3 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణానికి 2009 లో నాంది పలికారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆశించిన పురోగతి లేదు. రాజోలి రిజర్వాయర్ నిర్మాణం కేసీ కెనాల్‌కు ఆయువు పట్టు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే చరిత్రలో నిలిచిపోతారు. ప్రస్తుతం ఆ బాధ్యత ప్రధానంగా ఆ నలుగురి భుజస్కందాలపై ఉంది. జిల్లాలో ప్రధానంగా మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, కడప నియోజకవర్గాల్లో కేసీ కెనాల్ విస్తరించి ఉంది. తాజాగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పుట్టా సుధాకర్‌యాదవ్, నంద్యాల వరదరాజుల రెడ్డి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, రెడ్డెప్పగారి మాధవీరెడ్డి రాజోలి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు..

జిల్లాలో గండికోట ప్రాజెక్టులో 27 టీఎంసీల సామర్థ్యంతో వరుసగా నాలుగేళ్లు నీరు నిల్వ చేశారు. అదే పరిస్థితి సీబీఆర్, పైడిపాళెం, వామికొండ, సర్వారాయసాగర్, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులల్లో పూర్తి స్థాయి సామర్థ్యంతో నీటి నిల్వలను కొనసాగించారు. కాగా ఆయకట్టు విస్తరణ సాధ్యపడలేదు. రాబోవు డిసెంబర్ నాటికి ఒక్క సర్వారాయసాగర్ ప్రాజెక్టు పరిధిలోనే 30వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే లక్ష్యంతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఆ పనులను పూర్తి చేసేందుకు టీడీపీ సర్కార్ చొరవ తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో 30వేల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణ చోటు చేసుకుంటే ఆదో చరిత్ర అవుతుంది. ఆ దిశగా ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అడుగులు వేయాలని.. అసెంబ్లీలో గళమెత్తాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భవితకు బంగారం స్టీల్ ప్లాంట్..

రాయలసీమకు తలమానికంగా నిలవనున్న ఉక్కు పరిశ్రమ భవిష్యత్‌కు బంగారం కానుంది. 25వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ సంస్థచే స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం ప్రభుత్వమే ఫోర్‌లైన్ రోడ్డు, రైల్వేట్రాక్, 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, కాంపౌండ్ వాల్, గండికోట ప్రాజెక్టు నుంచి నీటి కేటాయింపులు, పైపు లైన్ నిర్మాణం ఇలా రూ.720 కోట్లతో మౌళిక వసతులు కల్పించింది. రూ.8,800 కోట్లు పెట్టుబడితో రెండు విడతల్లో 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. తొలివిడతలో రూ.3,300 కోట్లు వెచ్చించనున్నారు. 2023 ఫిబ్రవరి 15న స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ ఏర్పాటు చేశారు. 2026 ఉగాదికి తొలివిడత పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేసుకునేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ మేరకు స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన సహకారం ఎన్డీయే ప్రభుత్వం అందించాల్సిన ఆవశ్యకత ఉంది. బీజేపీ ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి చొరవ తీసుకొని నిర్మాణానికి సహకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మూతపడిన కర్మాగారాలపై మాట్లాడాలి



మైదుకూరులో మూతబడిన పాల కేంద్రం, దాణా ఫ్యాక్టరీలపై ఎమ్మెల్యేలు గళమెత్తాలి. అప్పట్లో వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వారి హయాంలోనే మూత పడిన పరిశ్రమలను తెరిపించాలి. దీనిపై నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పించాలి. అలాగే తెలుగు గంగ కింద అసంపూర్తిగా ఉన్న పంట కాలువలు పూర్తి చేసి సకాలంలో సాగునీరు అందేలా పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

– ఏవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, మైదుకూరు

'రాజోలి'పై మాట నిలబెట్టుకోవాలి



వ్యవసాయానికి ప్రధాన సాగునీటి వనరయిన రాజోలి రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడాలి. ఇప్పటికే ఆయన పలుసార్లు రాజోలి పూర్తి చేస్తానని చెప్పారు. చెప్పిన మాటను నిలబెట్టుకోవాలి. ఇదే క్రమంలో మైదుకూరులో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లాలి.

– శ్రీరామ వంశీ, జనసేన మండల అధ్యక్షుడు, చాపాడు మండలం

సీమ అభివృద్ధికి ప్యాకేజీ అడగాలి



విభజన చట్టంలో రూపొందించిన ప్రకారం రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. ఎన్నికల సందర్భంగా ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతోపాటు మెడికల్ కాలేజిని మంజూరు చేయిస్తామన్నారు. ఈ పనులపై ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. – బి.రామయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రొద్దుటూరు.

ఆర్‌ఓబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



కమలాపురం పట్టణాభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఆర్‌ఓబీ నిర్మాణానికి యువ ఎమ్మెల్యే చైతన్యరెడ్డి చొరవ చూపాలి. సుదీర్ఘ కాలంగా ఆర్‌ఓబీ నిర్మాణానికి నోచుకోక పోవడంతో స్థానికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్‌బీఐ, ప్రభుత్వ ఆసుపత్రి, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు, పాఠశాలలన్నీ గేటుకు అవతలివైపే ఉన్నాయి. ఇక్కడికి రావాలంటే రైల్వే గేటు సమస్య జటిలంగా ఉంది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌ఓబీపై ఎమ్మెల్యే గళమెత్తాలి.

– నాగేంద్ర ప్రసాద్, కమలాపురం

స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయాలి



నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు రావాలంటే కచ్చితంగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేయాలి. ఇప్పటివరకు స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేస్తున్నారేగానీ పనులు జరుగలేదు. ఇప్పటికైనా ఎన్‌డీఏ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కలను నెరవేర్చి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కలిగేలా చూడాలి. – పామిలేటి, రాయలసీమ పోరాట సమితి నాయకుడు.

మెడికల్ కాలేజీని మంజూరు చేయించాలి



ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ప్రభుత్వం ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీని మంజూరు చేయాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువలను నిర్మించి దోమలు లేని ప్రొద్దుటూరుగా తీర్చిదిద్దాలి. ప్రొద్దుటూరులో చేనేతలు ఎక్కువగా ఉన్నారు.. ప్రభుత్వం అపెరెల్ పార్కును మంజూరు చేయాలి. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు తప్పకుండా ఆడిటోరియం నిర్మించాల్సిన అవసరం ఉంది.

– జింకా సుబ్రహ్మణ్యం, ప్రొద్దుటూరు

కొప్పర్తి పారిశ్రామికవాడను ప్రోత్సహించండి..

కొప్పర్తి పారిశ్రామికవాడలో 550 ఎకరాలల్లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ) ఏర్పాటు చేశారు. అందులో రూ.10వేల కోట్లు పెట్టుబడులు లక్ష్యంగా పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. అందులో ఇప్పటికే రూ.1100 కోట్లతో పెట్టుబడులు లభించాయి. 3,155 ఎకరాల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు గత సర్కార్ శ్రీకారం చుట్టింది. అక్కడ రూ.18వేల కోట్లు పెట్టుబడులకు అంచనా వేసింది. పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించేందుకు ప్రణాళికలు రచించింది. ఆ ప్రణాళికలు కొనసాగించి, కొప్పర్తి పారిశ్రామిక ప్రగతి కోసం ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత జిల్లా ప్రజాప్రతినిధులదే.



'అన్నమయ్య'బాధ్యత రాముడుపైనే..

2021లో వరద ఉత్పతికి అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకపోయింది. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి 2022 డిసెంబర్ 26న టెండర్లును ఆహ్వానించారు.గతంలో 5గేట్లు ద్వారా 2.17లక్షల క్యూసెక్కులు మాత్రమే డిశ్చార్జి చేసేలా స్పిల్‌వే ఉండేది. ఆ స్థానంలో 25 గేట్లు ఏర్పాటు చేస్తూ, 5.60లక్షల క్యూసెక్కుల నీరు డిశ్చార్జికి యోగ్యంగా ఉండేలా స్పిల్‌వే నిర్మించేందుకు డిజైన్ చేశారు. 10వేల ఎకరాల ఆయకట్టుతోపాటు, రాజంపేట, పుల్లంపేట ప్రాంతాలకు తాగునీరు అందించే లక్ష్యంతో రూపొందించారు. సదరు కాంట్రాక్టు సంస్థ త్వరగా పనులు చేసేలా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది.



గండికోట ప్రత్యేకతపై దృష్టి సారించాలి

గండికోట టూరిజం స్పాట్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండేది. బేషజాలకు తావు లేకుండా టీడీపీ సర్కార్ సైతం అంతర్జాతీయ స్థాయిలో కీర్తి గడించనున్న గండికోట ప్రాజెక్టు అభివృద్ధికి కట్టుబడి ఉండాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఇదివరకూ 7స్టార్ హోటల్ నిర్మాణానికి ఒబెరాయ్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఆమేరకు 2023 జూలై 9న శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే గండికోట గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి చేరనుంది. ఆ దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు.



న్యూస్‌రీల్

బీసీ వెల్ఫేర్ అధికారిగా భరత్



కలెక్టర్‌ను కలిసిన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారి భరత్‌కుమార్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారిగా ఎం.భరత్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టర్ శివశంకర్‌ను కలిశారు. భరత్‌కుమార్‌రెడ్డి ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ పూర్తి చేశారు. 2022లో గ్రూప్–1 సర్వీసుకు ఎంపికయ్యారు. కర్నూలులో శిక్షణ పూర్తి చేసుకుని తొలి నియామకం కింద కడపకు వచ్చారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట : జవహర్ నవోదయ విద్యాలయం(నారమరాజుపల్లె, రాజంపేట)లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌వీఓడీఏవైపి.జీఓవీ.ఇన్, హెచ్‌టీటీపీఎస్://ఎన్‌వీఓడీఏవైపి.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సంప్రదించాలన్నారు.

సెప్టెంబర్ 14న వర్క్‌షాప్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆప్‌కీ ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ సెప్టెంబర్ 14,15 తేదీల్లో నిర్వహించనున్నామని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో వర్క్ షాప్ కరపత్రాలను ఆవిష్కరించారు. మైనార్టీలపై జరుగుతున్న అసత్య, విద్వేష ప్రచారాలను ఎండగడుతూ ప్రజలలో చైతన్యం కలిగించడానికి నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్ పిలుస్తోంది

- సృజనాత్మక ఆవిష్కరణలకు అదును
- ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల రూపకల్పనకు అవకాశం
- విద్యార్థుల నుంచి నామినేషన్లు ఆహ్వానం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు
- నామినేషన్‌కు ఎంపికైన విద్యార్థికి రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతి



గతంలో జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

2022-21 నుంచి నమోదైన నామినేషన్ల వివరాలు ఇలా...

సంవత్సరం	దాఖలైన నామినేషన్లు
2020–21	1473
2021–22	1707
2022–23	1986
2023–24	2727

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా వారిలోని ఆలోచనలను వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ మనాక్ వేదికగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఏటా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్ పేరిట విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా పోటీలను నిర్వహిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం 2024–25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పేరిట పోటీలకు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నామినేషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సహజంగా సమస్యను గుర్తించి ఆ సమస్యకు పరిష్కారాన్ని సూచించే విధంగా ప్రాజెక్టుల తయారీ ఉండాల్సి ఉంటుంది.

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి...

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వారి సైన్సు ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 900కు పైగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాలల నుంచి 5 నామినేషన్లను దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగు వేలు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందులో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను టీటీటీ.జీఽటఇజీట్ట్సుల్లీచ్ఛీటఛీట.ఛీట్ట.జౌఠి.జీ ఽ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పాఠశాల లాగిన్ ద్వారా నమోదు చేయాలి. ఇందుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

2023–24లో జరగని జిల్లాస్థాయి ప్రదర్శన...

జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఇన్‌స్పైర్‌మనాక్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల స్థాయి నుంచి జిల్లావ్యాప్తంగా 2727 నామినేషన్లను అప్‌లోడ్ చేశారు. వాటిల్లో నుంచి 241 ప్రాజెక్టులను అధికారుల జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఈ ఎంపికైన ప్రాజెక్టులకు ఒక్కో ప్రాజెక్టుకు రూ. 10 వేల చొప్పన అప్పట్లో నగదు కూడా విద్యార్థుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిసింది. విద్యార్థులను కూడా ప్రాజెక్టులను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించలేదు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల ప్రదర్శన కూడా నిర్వహించాల్సి ఉంది.



అందరి భాగస్వామ్యంతో...



విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని ఆలోచనలకు పదును పెట్టి ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతం చేయాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు మంది విద్యార్థులు ఎంపిక చేసి నమూనాలను అప్‌లోడ్ చేయాలి. ముఖ్యంగా ప్రతి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని సైన్సు ఉపాధ్యాయుల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

పర్యావరణ హితమైన....

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు తమ మేధో శక్తిని రంగరించి చక్కటి ఆలోచనతో డ్రాఫ్టు రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు పంపించిన అంశాలను వారు పరిశీలించి మంచి ఆలోచనలతో కూడిన ప్రాజెక్టును ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ప్రాజెక్టుకుతోపాటు విద్యార్థికి సంబంధించి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబర్, ఎంటర్ చేయాలి. ఇలా ఎంటరైన విద్యార్థి ఖాతాకు రూ. 10 వేలు వారి బ్యాంకు ఖాతాకు జమచేస్తారు. ఈ డబ్బులతో ఉపాధ్యాయుడి సహకారంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు తీసుకురావాల్సి ఉంటుంది.

సమస్యల పరిష్కారంపై దృష్టి

కలెక్టర్ శివశంకర్



కలెక్టర్‌కు తమ సమస్యలను తెలియజేస్తున్న సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన ప్రజల ఫిర్యాదులు స్వీకరించారు.

- గుట్టుచప్పుడు కాకుండా ఈనెల 13వ తేది రాయచోటిలో ఉమ్మడి జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు నిర్వహించడం వల్ల తామంతా తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని క్రీడాకారులు అంకన్న, కన్నా, బాబు మహేష్, వంశీ ఫిర్యాదు చేశారు. సీఈఓ జి.ప్రసాద్, కార్యదర్శి జి.శ్రీదేవి వైఖరి ఇందుకు కారణమని, సాఫ్ట్‌బాల్ ఎంపికలను రద్దు చేసి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.
- బెల్ట్‌షాపుల ద్వారా విచ్చలవిడిగా జరుగుతున్న లిక్కర్ విక్రయాలను అరికట్టాలని వేంపల్లె మండలం తాళ్లపల్లెకు చెందిన గంగన్న కోరారు.
- పుష్పగిరి క్షేత్రం చుట్టూ, పరిసర ప్రాంతాల్లో పాత విఘ్నేశ్వర దేవస్థానం నుంచి గిరి ప్రదక్షిణ, ఆది పూజా కార్యక్రమాలను నిర్వహించాలని పలు మార్లు దేవాదాయశాఖకు విన్నవించినా ప్రయోజనం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని వల్లూరు మండలం భాకరాపురం గ్రామానికి చెందిన రాంబాబు కోరారు.
- పెన్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూములను ఆన్‌లైన్ చేయడం తదితర పలు సమస్యలపై ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి ఫిర్యాదులు సమర్పించారు. ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ నిర్వహించి గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సౌమ్యనాథ స్వామి చక్రస్నానం



కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నందలూరు : జిల్లాలో చరిత్రాత్మక, వైష్ణవ దేవాలయం నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్ కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామిని పల్లకిలో మాఢవీధుల గుండా ఊరేగించారు. పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రతల్వార్‌ను కోనేటిలో చక్రస్నానం ఆచరించారు. రాత్రి ధ్వజారోహణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

కనుల పండువగా కల్యాణం



శివకేశవుల కల్యాణ దృశ్యం

రాజంపేట : అన్నమాచార్యుల జన్మ స్థలమైన తాళ్లపాకలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శివకేశవుల కల్యాణం కనుల పండువగా జరిగింది. తిరుమల-తిరుపతి దేవస్థానముల వేదపండితులు కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామికి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి కల్యాణం నిర్వహించారు. శివకేశవులు ఇరువురికి ఒకే వేదికపై కల్యాణోత్సవం జరగడం తాళ్లపాకలోని ప్రత్యేకత. కల్యాణం అనంతరం స్వాములు గజవాహనంపై మాఢవీధులలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు.

క్లుప్తంగా

నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 19వ తేదీన రాత్రి బిల్టప్ సమీపంలో పుత్తా ఎస్టేట్స్‌లోని ఖాళీ స్థలంలో చింపిరి వెంకటేష్ (32)ను కడప రవీంద్రనగర్‌కు చెందిన సాదిక్‌వలీ హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో నిందితుడు సాదిక్‌వలీని కడప తాలూకా సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ మల్లికార్జున తమ సిబ్బందితో కలిసి సోమవారం అతని ఇంటి వద్ద అరెస్ట్ చేశారు.

ముద్దనూరు మండలంలో సంచార జూదం

టాస్క్‌ఫోర్స్ : ముద్దనూరు మండలంలో గత 4 రోజులుగా సంచార జూదం నిర్వహిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని వేల్పుచెర్ల, దేనేపల్లె, కాన పరిసర ప్రాంతాల్లో మంగతాయి జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో రోజుకు కనీసం రూ.50 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. రోజుకొక ప్రాంతం చొప్పున ఈ జూదం జరుగుతోందని విశ్వసనీయ సమాచారం. అనంతపురం జిల్లాకు చెందిన కొంత మంది జూదరులు కూడా వస్తున్నట్లు సమాచారం. పోలీసుల అండతోనే ఈ జూదం నిర్వహిస్తున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ మొబైల్ జూదాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మహిళపై అత్యాచారయత్నం

చాపాడు : మండలంలోని అన్నవరం పంచాయతీ చెండ్లూరుకు చెందిన పట్నం దస్తగిరమ్మ(26)పై అదే గ్రామానికి చెందిన బయపురెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం అత్యాచారయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అర్‌వీ కొండారెడ్డి పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాసులరెడ్డి గత కొన్ని రోజులుగా దస్తగిరమ్మను లోబర్చుకునేందుకు సైగలు చేస్తుండటం, ఆమె వెంట పడటం వంటివి చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో దస్తగిరమ్మ ఇంటి వద్ద గల పశువుల కొట్టం దగ్గర పనులు చేసుకుంటుండగా శ్రీనివాసులరెడ్డి వెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడని చెప్పారు. దస్తగిరమ్మ కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడి వచ్చిన కాపాడారన్నారు. ఈ ఘటనపై బాధితురాలు దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

కడప సెవెన్‌రోడ్స్ : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ శివశంకర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామంలో 4.27 ఎకరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ (ఎస్‌ఏసీ) జి.విద్యాసాగర్, గ్రామ సర్వేయర్ ఎ.ప్రవీణ్‌కుమార్, వీఆర్వో జె.గురవయ్య కలిసి రికార్డులను పరిశీలించకుండా, ప్రాథమిక విచారణ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా కొండా వెంకట సుబ్బమ్మకు మ్యూటేషన్ చేశారని పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన కొండా వెంకట సుబ్బమ్మ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆ భూమిని మార్టిగేజ్ చేసి రూ.8 లక్షల రుణం తీసుకున్నదని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై బద్వేలు ఇన్‌చార్జి ఆర్డీఓ చంద్రమోహన్‌ను విచారణ అధికారిగా నియమించి నివేదిక తెప్పించుకున్నామన్నారు. ఆ నివేదిక మేరకు ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశామని వివరించారు. అంతేకాకుండా వీరిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఛార్జెస్ కూడా ఫ్రేం చేశామని పేర్కొన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ల కార్యాలయాల వద్ద తప్పనిసరిగా నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కలెక్టర్ శివశంకర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సెక్యూరిటీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని డీసీఓను ఆదేశించారు.

కొత్త బంగారులోకం

- స్వాగతం పలుకుతున్న చదువుల ఒడి
- ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ


అడ్మిషన్లు పొందేందుకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు

వేంపల్లి : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాయలం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం కొత్తగా ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, డీన్ అకాడమిక్, క్యాంపస్ కౌన్సెలింగ్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ రత్నకుమారీలు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు.

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా..

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 6 గంటలకే ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎంట్రన్స్ భాగంలో ఉన్న రాజీవ్ సర్కిల్ వద్ద ముందుగా వచ్చిన విద్యార్థులకు టోకన్లను అందజేశారు. వివిధ దశలలో స్క్రీనింగ్ చేయడానికి ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అడ్మిషన్లు పొందేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

- టోకన్లు తీసుకున్న విద్యార్థులకు ఇడుపులపాయ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫైల్ డిస్ట్రిబ్యూషన్ నిర్వహించారు. ఆ తర్వాత ఫస్ట్ ఫ్లోర్‌లో క్యాస్ట్ వెరిఫికేషన్, ఫీజు పేమెంట్, ఐడీ కార్డుల డిస్ట్రిబ్యూషన్, బయోమెట్రిక్ అటెండెన్స్, చివరగా ఫైల్ సబ్మిట్‌తో విద్యార్థి కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేంపల్లి నుంచి ఇడుపులపాయకు ప్రతి గంటకు ప్రత్యేక బస్సులను నడిపారు.
- మొదటి రోజున 515 మందికి అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉండగా 427 మంది హాజరై అడ్మిషన్లను పొందారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు భోజన సదుపాయం, టెంటులు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రోజర్ బిన్నీ, అధికారులు చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరి, ఇమ్రాన్, తిరుపతిరెడ్డి, లింగమూర్తి, జ్ఞానవెంకట్ తదితరులు దగ్గరుండి నిర్వహించారు.
- మంగళవారం రోజు మరో 500 మంది విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జూలై 24, 25వ తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లోనే ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి సంబంధించి రెండు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌ను స్మరించుకున్న విద్యార్థులు

రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లా నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వచ్చారు. ఈ నేపథ్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వారు స్మరించుకున్నారు. ఆయన ఈ ట్రిపుల్ ఐటీలను స్థాపించడం వల్లే మాలాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అవకాశం వచ్చిందని అన్నారు. ఆయనను ఎన్నటికీ మరువలేమన్నారు. కష్టపడి బాగా చదివి తల్లిదండ్రులకు, ట్రిపుల్ ఐటీకి గొప్ప పేరు తీసుకువస్తామని వారు పేర్కొన్నారు.

ఇంజినీర్లుగా సేవ చేస్తాం

ట్రిపుల్ ఐటీలో చదివి భావిభారత ఇంజినీర్లుగా దేశానికి సేవ చేయాలన్నదే లక్ష్యంగా చదువులో రాణించి ముందుకు సాగుతామని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తెలిపారు. ఎక్కువగా రైతు కూలీల బిడ్డలే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో ఉన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

కూలీ పనులు చేసుకుంటూ చదివించారు



మా తండ్రి చంద్రశేఖర్, తల్లి సుజాత కూలీ పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 573 మార్కులు సాధించారు. నేను గ్రూప్స్‌నకు ప్రిపేర్ అయ్యి ఐఏఎస్ అవుతాను. ట్రిపుల్‌ఐటీలో ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేస్తాను.

\- ఎ.కుసుమ, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా

ట్రిపుల్‌ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను



ట్రిపుల్‌ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను. వ్యవసాయ కుటుంబంలో ఉంటూ తల్లిదండ్రులు శ్రీనివాసులు, ఎల్లమ్మలు నన్ను ఎంతో ప్రోత్సహించారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా ట్రిపుల్‌ఐటీలో కూడా కష్టపడి చదివి అద్భుత ఫలితాలను సాధిస్తాను. డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివి 571 మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీలో కష్టపడి చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

\- జి.కార్తీక్, కుప్పం, చిత్తూరు జిల్లా

సివిల్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం



ట్రిపుల్ ఐటీలో రాణించి సివిల్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం. మాది వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం కొత్తగుంట పల్లి. తల్లిదండ్రులు రాజునాయక్, కులాయమ్మలు కూలి పని చేసుకుంటూ నన్ను చదివించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 10వ తరగతి చదివి 560 మార్కులు సాధించాను.

\- బి.విష్ణునాయక్, కొత్తగుంటపల్లి, వైఎస్సార్ కడప జిల్లా

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తా



ట్రిపుల్‌ఐటీలో వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ప్రతిభను కనబరుస్తాను. మా పాఠశాలలో కష్టపడి చదివి ఫస్ట్‌లో రాణించాను. ట్రిపు ఐటీలో కూడా ఉత్తమ ఫలితాలను సాధిస్తా. తల్లిదండ్రులు రామరాజు, రామలక్ష్మమ్మలు వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట గ్రామంలో ఉన్న డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివి 570 మార్కులు సాధించాను.

\- డి.రాధిక, బనగానపల్లి, కర్నూలు జిల్లా

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

- శాంతి భద్రతలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో ఆటవిక పాలన, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక, ఆటవిక, రాక్షస పాలన నడుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పాలు ప్రాంతాల్లో రెడ్ బుక్ అంటూ పెద్ద పెద్ద హోర్డింగులు వెలిసాయని, ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, రెడ్‌బుక్ కాదు అది బ్లడ్ బుక్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వద్ద జరిగిన తీరు అత్యంత దారుణమన్నారు. రాష్ట్రంలో పదుల సంఖ్యలో హత్యలు, వందల సంఖ్యలో హత్యాయత్నాలు, వేల సంఖ్యలో దాడులు, ఆస్తుల ధ్వంసాలు జరిగాయన్నారు. ఈ ఘటనల్లో వేల మంది సొంతూళ్లు వదిలి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యలు, హత్యాయత్నాలను ప్రేరేపిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని, దాడులకు పాల్పడాలని ప్రభుత్వ పెద్దలు చెప్పకనే చెబుతున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరిగినా కనీసం ముఖ్యమంత్రి గానీ, హోం మంత్రి గానీ శాంతి భద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించక పోవడం శోచనీయమన్నారు. వినుకొండలో జరిగిన రషీద్ హత్య ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. అలాగే ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పలపై టీడీపీ నాయకులు దాడులు చేస్తే వైఎస్సార్‌సీపీ వారిపైనే కేసులు నమోదు చేయడం దారుణం అన్నారు. వీటిని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందని, రాష్ట్రంలో జరిగే అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టకుంటే భవిష్యత్తులో పర్యవసానం చెల్లించక తప్పదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, విధ్వంసాల గురించి తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ అబ్దుల్ నజీర్ దృష్టికి తీసుకెళ్లారని, వాటిని నిరసిస్తూ ఢిల్లీలో ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నామన్నారు. అలాగే ఈ దురాగతాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి టీడీపీ మద్దతు లేకపోతే కూలిపోయే ప్రమాదం ఉందని, ఇప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదాపై నోరు మెదపడం లేదన్నారు. తమ హయాంలో మోదీ ప్రభుత్వానికి పూర్తి మెజార్టీ ఉండేదని, అందుకే తమ విన్నపాలను పెడచెవిన పెట్టారని గుర్తు చేశారు. విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చడానికి చంద్రబాబు ప్రయత్నం చేయాలన్నారు. టీడీపీ నాయకులు అమాయకులైన ప్రజలపై దాడులు చేసి వారిని పొట్టన పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ విష సంస్కృతిని విడనాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, షావలి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి


బాధితుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సోమవారం కడప నగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో బాధితులతో వారు ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌లకు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్లూడబ్లూడబ్లూ డాట్ సైబర్‌క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో, టోల్ ఫ్రీ నెంబర్:1930కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు అదనపు ఎస్పీలు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి డీఎస్పీ కె.రవికుమార్ పాల్గొన్నారు.

నిరుపేద.. ఆపై పెద్ద బాధ

అతను నిరుపేద. ఆ పేదింటికి పెద్ద దిక్కు. చిన్న పని చేసుకుంటూ ఉన్నంతలో జీవనం సాగించే వాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యం పంజా విసిరింది. దీంతో అతను నిర్జీవంగా మారాడు. ఇంటి యజమాని మంచానపడడంతో ఆ కుటుంబంలో స్తబ్దత నెలకొంది. ఆపన్న హస్తం కోసం ఆ కుటుంబం ఎదురు చూస్తోంది.

- గుండె, ఊపిరితిత్తులకు మధ్యలో గడ్డ
- కిడ్నీతోపాటు శరీరంపై పెను ప్రభావం
- సర్జరీ చేయాలని వైద్యుల సూచన
- దాతల సాయం కోసం ఎదురుచూపు


అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వెంకటరమణ

కడప రూరల్ : కడప నగరం ప్రకాష్ నగర్‌లో వెంకటరమణ, సరిత దంపతులు నివసిస్తున్నారు. అద్దె ఇంటిలో నంబర్: 8/86 (మిద్దెపైన) ఉంటున్నారు. వీరికి పదకొండేళ్ల సంప్రీత్ అనే కుమారుడు ఉన్నాడు. ఈ బాలుడు స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. వీరిది నిరుపేద కుటుంబం.

ఆ ఇంటి విషాదం నింపిన అనారోగ్యం

వెంకటరమణ స్థానిక వస్త్ర దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా పని చేసే వాడు. ఆ వచ్చే డబ్బులతో ఇంటిని నెట్టుకొచ్చే వాడు. 'ఉన్నంతలో జీవనం సాఫీగా సాగిపోతోంది' అని అనుకొనే తరుణంలో ఆ పేదింట అనారోగ్యం కాటు వేసింది. ఒక రోజు వెంకటరమణకు ఉన్నఫళంగా రక్తపు విరేచనాలు, వాంతులు అయ్యాయి. దీంతో ఆయనతోపాటు భార్య సరిత ఆందోళనకు గురయ్యారు. కొందరి సూచనల మేరకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు వెంకటరమణను పరీక్షించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో ఒక గడ్డను గుర్తించారు. ఆ ప్రభావం కిడ్నీతోపాటు శరీరంపై పెను ప్రభావం చూపిస్తోందని నిర్ధారించారు. తక్షణం గడ్డను తొలగించడానికి సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. అందుకోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఈ వైద్య ఖర్చుల కోసం ఇప్పటికే ఆ కుటుంబం దాదాపు రూ.50 వేలకు పైగా అప్పు చేసింది. పూట గడవడమే గగనంగా మారిన ఆ కుటుంబానికి రూ.3 లక్షలకు పైగా డబ్బును సమకూర్చుకోవడం అనితర సాధ్యంగా మారింది.

దాతలు దయ చూపితే..

వైద్యులు మరో మూడు రోజుల్లో (గురువారం లోపు) వెంకటరమణకు సర్జరీ చేయాలని సూచించారు. లేదంటే ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది. వెంకటరమణ భార్య సరిత తన భర్త ఆరోగ్యం కోసం మొక్కని దేవుడంటూ లేడు. దాతలు సహకరిస్తే ఆ ఇంట సంతోషాల జీవన జ్యోతి వెలుగుతుంది. వెంకటరమణ ఫోన్ నంబరు: 6303718083, బ్యాంకు ఖాతా నెంబరు 50100631917829, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎర్రముక్కపల్లె, కడప.

నా భర్తను బతికించండి



నా భర్త అనారోగ్యంతో బాధపడతున్నాడు. ఆయనే మా జీవనాధారం. ఆయనకు ఆరోగ్యం బాగలేక మంచాన పడ్డారు. డాక్టర్లు సర్జరీ చేయాలన్నారు. అందుకోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఆరోగ్య శ్రీలో ఈ జబ్బుకు చికిత్స లేదని వైద్యులు తెలిపారు. దాతలు దయ చూపి నా భర్తను బతికించాలి.

\- సరిత, వెంకటరమణ భార్య

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య


గురులక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవునికడపలో తన తల్లి విజయ ఇంటికి వచ్చిన కుమార్తె గురులక్ష్మి (32) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమవారం రాత్రి మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకుంది. అక్కాయపల్లిలో వుంటున్న విశ్వనాథ్‌కు, గురులక్ష్మికి వివాహమై 12 ఏళ్ల అయింది. వీరికి కుమారుడు, కుమార్తె వున్నారు. దివ్యాంగురాలైన గురులక్ష్మి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ, ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోంగా పని చేస్తోంది. ఈక్రమంలో పుట్టింటికి వెళ్లింది. సోమవారం తన తల్లి విజయ కూలి పనికి వెళ్లింది. మధ్యాహ్నం వచ్చేసరికి ఇంటిలో గురులక్ష్మి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని చూసి తల్లి, బంధువులు విలపించారు. సమాచారం తెలుసుకున్న చిన్నచౌక్ ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారు..

- మా ఇంటి నిర్మాణ పనుల కోసం వెళ్తే..
- ఓ కుటుంబం ఆవేదన


బాధితురాలు పి.లీలావతి

ప్రొద్దుటూరు : టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి తమ ఇంటి పనులను అడ్డుకుంటున్నారని ప్రొద్దుటూరు పట్టణంలోని పి.లీలావతి కుటుంబీకులు తెలిపారు. లింగారెడ్డి ఇంటి పక్కనే కొనుగోలు చేసిన స్థలంలో సోమవారం ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ లింగారెడ్డి సోదరుడు అయిన మల్లెల చంద్ర ఓబుళరెడ్డి స్థలాన్ని మూడు నెలల క్రితం తాము కొనుగోలు చేశామన్నారు. ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు పలు సార్లు ప్రయత్నించినా లింగారెడ్డి దౌర్జన్యంగా వెనక్కి పంపుతున్నారన్నారు. 3.5 సెంట్ల స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, తమ డబ్బు తిరిగి ఇస్తే స్థలం వెనక్కి ఇస్తామని కూడా తెలిపామన్నారు. ఇందుకు లింగారెడ్డి ఒప్పుకోకపోవడంతోపాటు దౌర్జన్యంగా తమ స్థలంలో పనులు చేపట్టకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన స్థలానికి సంబంధించిన పత్రాలను చూపి కరెంట్ మీటర్ బిగించుకున్నామని, బోర్ వేయించుకున్నామని తెలిపారు.

మధురై–ఓకా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మధురై–ఓకా (09519) మధ్య కడప మీదుగా నడిచే వారంతపు రైలును ఈనెల 26న దారి మళ్లించారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. బాలుపల్లె–మామండూరు మధ్య రైల్వేబ్రిడ్జి పనులు జరుగుతుండడంతో ఈ దారి మళ్లింపు చేపట్టారని పేర్కొన్నారు. ఆరోజు ఈ రైలు కాట్పాడి నుంచి పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓకాకు వెళుతుందన్నారు.

నంద్యాల డెమో పాక్షిక రద్దు

నంద్యాల–రేణిగుంట మధ్య కడప మీదుగా నడుస్తున్న నంద్యాల డెమో (07284/85) ఈనెల 26వ తేది వరకు పాక్షికంగా రద్దు చేశారన్నారు. బాలుపల్లె–మామండూరు మధ్య రైల్వే బ్రిడ్జి పనులతో ఈ రైలును నంద్యాల నుంచి కడపకు, కడప నుంచి నంద్యాల వరకు మాత్రమే నడుపుతారన్నారు. ప్రయాణికులు ఈ అంశాలను గుర్తించుకోవాలన్నారు.

అత్తమామలే హంతకులు

- మాజీ వలంటీర్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- అత్తమామలు, కిరాయి హంతకుల అరెస్టు

హోసూరు : బెంగళూరు వద్ద హోసూరు సమీపంలో వైఎస్సార్ జిల్లా వాసి కాశినాయన మండలం గొంటువారిపల్లె గ్రామానికి చెందిన మాజీ వలంటీరు కల్లూరి అస్సానయ్య (26) హత్య కేసులో అత్తమామతోపాటు ఎనిమిది మందిని హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అసానయ్య హోసూరు సమీపంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని పీజీ హాస్టల్‌ను ప్రారంభించాడు. గత 5వ తేదీ హాస్టల్ భవనంలో అసానయ్యను కొందరు పొడిచి చంపారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అసానయ్య, పీరంభి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. వీరికి మూడు నెలల పాప ఉంది. ఈ ప్రేమ వివాహం పీరంభి తల్లిదండ్రులకు నచ్చకపోవడంతో.. అసానయ్యను హత్య చేసి కూతురికి మరో పెళ్లి చేయాలని తీర్మానించుకొన్నారు. అత్తమామలు, వారి బంధువు కొందరు కిరాయి హంతకులను హోసూరుకు తీసుకువచ్చి అల్లున్ని కలిశారు. మాటల్లో పెట్టి అతన్ని హత్య చేసి పరారయ్యారు. అప్పటి నుంచి పోలీసులు దర్యాప్తు చేసి ఆధారాలను సేకరించారు. అసానయ్య మామ ఖాదర్‌వలి (45), అత్త భీరమ్మ (45), చిన్నత్త మాదేవి అలియాస్ వీరమ్మ (35), ఈమె ప్రియుడు శ్రీనివాసులు (38), ఇతర నిందితులు నంద్యాలకు చెందిన బండిశేఖర్ (26), కడపకు చెందిన వినోద్‌కుమార్ (29), దంటు అంకాల్ (35), సిద్దు (25)ను అరెస్టు చేశారు.



సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- మదనపల్లి (Govt.హాస్పిటల్ ప్రక్కన) కడప సెక్యూరిటీగార్డ్, ఆఫీస్ బాయ్, ప్యాకింగ్ హెల్పర్, ఫీల్డ్ ఆఫీసర్(M), PF & ESI బజాజ్ ఎలక్ట్రానిక్ లో కావలెను. 9989139239, 8179196300.
- ఆఫీస్ బాయ్ & ప్యాకింగ్ హెల్పర్ & వెయిట్ లిఫ్టింగ్ & కడప మదనపల్లి బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో కావలెను. 8179196300, 99891 39239.
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక